ప్రజాశక్తి
బుధవారం 3 డిసెంబర్ 2025
1
శ్రీ సత్యసాయి



ఘనంగా బాబయ్య ఉరుసు

ప్రజాశక్తి-పెనుకొండ

బాబాఫక్రోద్దీన్ 753 వ గంధం ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉరుసు ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి సవిత జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా లతో కలిసి బాబయ్య స్వామికి చాదర్ సమర్పించారు. ఈసందర్భంగా మాజీ ముతవల్లి తాజ్‌బాబా మంత్రి సవితకు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి సవిత చాదర్‌ను ముతవల్లికి అందించారు. అనంతరం బాబయ్య స్వామి కి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



చాదర్‌ను దర్గా వద్దకు తీసుకువస్తున్న మంత్రి సవిత

పేరుకే ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్

రహదారులపైనే వాహనాల పార్కింగ్ నిత్యం ట్రాఫిక్ జామ్ ఇబ్బందుల్లో ప్రజలు



పరిగి రోడ్డులో ట్రాఫిక్ జామ్ అయిన దృశ్యం

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్య సాయి జిల్లాలోనే హిందూపురం అతి పెద్ద పట్టణం. దీంతో ప్రభుత్వం హిందూపురం పట్టణానికి ప్రత్యేక ట్రాఫిక్ స్టేషన్‌ను ఏర్పాటు చేసి, ఇద్దరు ఎస్ఐలు, మరో ఇద్దరు ఏఎస్ఐలతో పాటు హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుల్, హోం గార్డులను నియమించింది. స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించిన వారికి నెలకు దాదాపు 1500 కేసులు వరకు నమోదు చేసి, రూ.1లక్ష వరకు జరిమానా విధిస్తున్నారు. ట్రాఫిక్ సిబ్బంది కేసులు నమోదులో చూపిస్తున్న శ్రద్ధ ట్రాఫిక్ నియంత్రించడంతో చూపించడం లేదన్న విమర్శలున్నాయి. దీంతో అసలు పురంలో ట్రాఫిక్ స్టేషన్ ఉందా...లేదా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.. నిత్యం గాంధీసర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, సబ్ రిజిస్టర్ కార్యాలయం ముందు ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ఉన్నప్పటికి ఎవరు పట్టించుకోవడం లేదు. దీంతో వాహనదారులు ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తున్నారు.. దీని వల్ల పాదచారులు సైతం నడచి వెళ్లాలన్న ఇబ్బందులు తప్పడం లేదు.

హిందూపురం పట్టణం అంటే వాణిజ్య పురం...హిందూపురం పురపాలక సంఘ జనాభా దాదాపు 1.90లక్షలు ఉంది. దాదాపు 50 వేల వరకు నివాస గృహాలున్నాయి. ప్రతి ఒక్కరు ఏదో ఒక వాహనాన్ని వినియోగిస్తున్నారు. విద్యార్థులు సైతం కళాశాలలకు వెళ్లాలంటే ద్విచక్రవాహనాలను వినియోగిస్తున్నారు. వీరితో పాటు చుట్టుపక్కల గ్రామాల వారు నిత్యం ఏదో ఒక పని మీద తమ వాహనాల్లో పట్టణానికి వస్తుంటారు. ఈ లెక్కన రోజుకు లక్షకు పైగా వాహనాల రాక పోకలు జరుగుతాయి. ఈ వాహనదారులందరూ ట్రాఫిక్ నిబంధనల మేరకు నడిచే విధంగా చూడాల్సిన ట్రాఫిక్ పోలీసులది. అయితే వారు జరిమానాలకు వచ్చే ప్రాధాన్యత ట్రాఫిక్ నియంత్రణపై చూపడం లేదన్న విమర్శలున్నాయి. గాంధీ సర్కిల్, డిఎల్ రోడ్డు, నట్ బజారు, మెయిన్ బజారులో భారీ వాహనాలు నిలబెట్టి లోడింగ్ అన్ లోడింగ్ చేస్తుంటారు. నిబంధనల మేరకు బారీ వాహనాలు పగలు పట్టణంలోకి రాకుడదని ఉన్నప్పటికి అవి యథేచ్ఛగా పట్టణంలోకి వచ్చి లోడింగ్ అన్ లోడింగ్‌కు చేస్తున్న వారిపై ట్రాఫిక్ సిబ్బంది చర్యలు తీసుకోవడం లేదు. ఇది చాలదన్నట్లు వాణిజ్య భవన సముదాయాల నిర్మాణ సమయంలో పార్కింగ్ కోసం స్థలాన్ని వదలకుండా భవన నిర్మాణాలు చేపట్టారు. దీంతో వారి దుకాణాలకు వచ్చే వారందరు రహదారుల్లో వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. వందలాది మంది రీయల్ ఎస్టేట్ దళారులు వారి వాహనాలను సబ్ రిజిస్టర్ కార్యాలయం ముందు నిత్యం వందల సంఖ్యలో నిలుపుతున్నారు. అదే విధంగా ఇందిరా మున్సిపల్ కాంప్లెక్స్ ముందు వందలాది మంది వాహనాలను నిలుపుతున్నారు. దీంతో 50 అడుగుల రోడ్డు కాస్తా 30 అడుగులకు కుదించుకు పోయింది. ఇప్పటికైనా పోలీసులు సబ్ రిజిస్టర్ కార్యాలయం ముందు, రహదారుల్లో వాహనాలు నిలపకుండా తగిన చర్యలు తీసుకోవడంతో పాటు పగటి సమయంలో లోడింగ్, అన్ లోడింగ్ జరగకుండా తగిన చర్యలు తీసుకుని అస్తవ్యస్తంగా ఉన్నా పురం ట్రాఫిక్‌ను చక్కదిద్దే విధంగా చర్యలు తీసుకోవాలి పుర ప్రజలు కోరుతున్నారు.



సబ్ రిజిస్టర్ కార్యాలయం ముందు నిలిపిన వాహనాలు



ఇందిరా కాంప్లెక్స్ ముందు నిలిపిన వాహనాలు

గుడిపల్లి రిజర్వాయర్‌తో ఎవరికీ నష్టం రానివ్వం

ప్రజలతో చర్చించాకే తుదినిర్ణయం బిసి సంక్షేమ శాఖమంత్రి సవిత



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-సోమందేపల్లి

గుడిపల్లి రిజర్వాయర్ నిర్మాణం ద్వారా ఎవరికీ నష్టం రానివ్వబోమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. గుడిపల్లి రిజర్వాయర్ నిర్మాణంపై ప్రజలతో చర్చించిన తరవాతే ముందుకెళతామన్నారు. త్వరలో పెనుకొండకు మరిన్ని పరిశ్రమలు రాబోతున్నాయని వెల్లడించారు. మండలంలోని గుడిపల్లి గ్రామం నుంచి తుంగోడు వరకూ చేపట్టిన రూ.2.80 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి మంత్రి సవిత మంగళవారం భూమి పూజ చేశారు, ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ, సోమందేపల్లి మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.4.50 కోట్లతో సీసీ రోడ్లు, కాలువలు, 40 గోకులం షెడ్లు నిర్మించామన్నారు. జేజేఎం పథకం ద్వారా మండలంలో తాగునీటి కల్పనకు రూ.3.33 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. సోమందేపల్లిలో రెండుసార్లు హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ గండిపడితే యుద్ధప్రాతిపదికను మరమ్మతులు చేశామన్నారు. సోమందేపల్లిలో రూ.50 లక్షలు వెచ్చించి నూతన ఆసుపత్రి భవనాలను వినియోగంలోకి తీసుకొచ్చామన్నారు. నాగినాయని చెరువు గ్రామంలో ఎస్టీ హాస్టల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సోమందేపల్లిలో కాపు, బీసీ భవనాల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించామని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సైతం ప్రభుత్వానికి పంపామని వెల్లడించారు.

మండలాల వారీగా అభివృద్ధిపై చర్చకు రెడీ : కూటమి ప్రభుత్వం ఏర్పడిన 18 నెలల్లో పెనుకొండ నియోజక వర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని మండలాల వారీగా జరుగుతున్న అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధమని సవాల్ విసిరారు. అర్హులైన పేదలందరికీ రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు.

గుడిపల్లికి రిజర్వాయర్ వద్దు : గుడిపల్లి గ్రామంలో రిజర్వాయర్ ఏర్పాటు చేయరాదని రిజర్వాయర్‌కు గ్రామస్తులు వ్యతిరేకంగా ఉన్నామని ఆ గ్రామ ప్రజలు మంత్రి సవితకు విన్నవించారు. మంగళవారం గ్రామంలో నూతన రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభానికి వచ్చిన మంత్రికి గ్రామ మాజీ సర్పంచి పెద్ద సుబ్బన్న అధ్యక్షతన వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. గతంలో నాసిన్, బెల్, కియా సంస్థలకు తమ గ్రామ రెవెన్యూ పొలం నుండి సుమారు 1500 ఎకరాల భూమిని ప్రభుత్వానికి ఇచ్చామన్నారు. ప్రస్తుతం గ్రామంలో 700 కుటుంబాలు నివసిస్తున్నామని ప్రతి కుటుంబానికి కేవలం రెండు మూడు ఎకరాల మాత్రమే వ్యవసాయ భూమి ఉందని చెప్పారు. గ్రామం చుట్టూ కొండ ప్రాంతం ఉండటంతో మేకలు, గొర్రెలు, పశువులు మేపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామన్నారు. చుట్టూ కొండప్రాంతం ఉండటంతో ఆర్డీటీ వారు పెద్ద పెద్ద చెక్ డ్యాములు నిర్మించి నీటి వసతి కల్పించారన్నారు. అంతేకాకుండా గ్రామంలో సుమారు మూడు చెరువుల ఉండటం అధిక నీటి వసతి ఉండటంతో ఉన్న కొద్దిపాటి వ్యవసాయ పొలంలోనే జొన్న, మొక్కజొన్న, వరి, రాగి వేరుశనగ వంటి పంటలు సంవత్సరం పొడవునా పండిస్తూ జీవనం కొనసాగిస్తున్నామన్నారు. ఇలాంటి భూమిపైన రిజర్వాయర్ నిర్మాణం చేపడితే సాగుభూమి లేకుండా పోతుందన్నారు. నియోజకవర్గంలో అనేక మండలాల్లో నిరుపయోగంగా ఉన్న భూమి అధికంగా ఉందని అలాంటి ప్రాంతాలలో రిజర్వాయర్ ఏర్పాటు చేసుకోవాలని కోరారు. స్పందించిన మంత్రి మాట్లాడుతూ రిజర్వాయర్ గుడిపల్లి పేరుతో ఉంటుందే తప్ప గుడిపల్లి గ్రామానికి , గుడికి , రైతుల భూములకు ఎటువంటి ఆటంకం ఉండదన్నారు. ఎక్కువ శాతం ప్రభుత్వ భూములు ఎక్కడైతే లభ్యమవుతాయో అక్కడే రిజర్వాయర్ కడతామని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పెద్దన్న , సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొండా వెంకటేశులు , చేనేత కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు మాబు , నేసే నాగరాజు , గుడిపల్లి గ్రామస్తులు కడపల్లి రంగప్ప, ముద్దప్ప , ఆదినారాయణప్ప, ఎస్ఆర్ సజ్జప్ప, సివి లక్ష్మయ్య, ఎస్ఆర్ వెంకటప్ప, శ్రీనివాసులు, గోవిందరాజులు, సోము, రంగనాథం , సజ్జప్ప , రమేష్ , ప్రభాకర్ , నంజుండప్ప, గంగ రత్న, యశోదమ్మ , చంద్ర మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. మంత్రి పర్యటనలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



సమస్యను మంత్రికి వివరిస్తున్న వ్యకాసం నాయకులు

విద్యతోనే భవిష్యత్తు

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్‌బుక్కపట్నం

ప్రజాశక్తి - బుక్కపట్నం

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండలంలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడి పాత్రను పోషించారు. ప్రభుత్వం చేపట్టిన ప్రాథమిక సాక్షరత, సంఖ్యాజ్ఞానం (ఎఫ్ఎల్ఎన్)కార్యక్రమములో భాగంగా మండల ప్రాథమిక పాఠశాల యందు జరుగుతున్న పరీక్షను పరిశీలించారు. పిల్లలు మొదటగా నేర్చుకోవాల్సింది చదవడం, రాయడం, లెక్కలు వంటి మౌలిక నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. అనంతరం పాముదుర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి 10 వతరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషు, హిందీ, గణితము విషయాలలో పలు ప్రశ్నలను అడిగారు. బోర్డుపై ఆంగ్లం లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్ గ్రామర్, హిందీ, ఇంగ్లీష్ భాష, గణితంలో మెలకువలను వివరించారు. విద్యార్థి హారికతో పద్యాలను చదివించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, డీఈవో కిష్టప్ప, ఎంపీడీవో శ్రీనివాసులు, తహశీల్దార్ నరసింహులు, ఎంఇఒ గోపాల్ నాయక్, మోహన బాబు, ప్రధానోపాధ్యాయురాలు వెంకటనరసమ్మ, వివిధ శాఖల అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యానవన పంటల పరిశీలన : మండల పరిధిలోని పలు గ్రామాలలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ఫామ్ ఉపాధిపాండ్లు, ఉద్యాన పంటలు, డ్రిప్ సదుపాయాలు తదితర కార్యక్రమాలను పరిశీలించి, అమలు పరిస్థితులను రైతులను, అధికారులను అడిగి అడిగితెలుసుకున్నారు. అనంతరం రాసింపల్లి గ్రామంలో రైతు అంచే శ్రీనివాసులు అభివృద్ధి చేసిన అధిక సాంద్రత మామిడి తోటను పరిశీలించారు. రైతులు ఆధునిక సాంకేతికతను ఉపయోగించి అధిక లాభాలు పొందాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా అందిస్తున్న సదుపాయాలను రైతులు సద్వినియం చేసుకొని ఇంకుడు గుంతలు తవ్వించుకొని, వ్యవసాయాన్ని లాభ సాటిగా మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఏపీఎంఐడి పీడి సుదర్శన్, ఉద్యాన అధికారి నవీన్ కుమార్, వ్యవసాయ అధికారి నటరాజ్, ఉపాధి హామీ, ఉద్యాన సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రీసర్వే పనుల్లో పారదర్శకత : మండలంలోని పాముదుర్తి గ్రామంలో కొనసాగుతున్న రీసర్వే పనులను కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ పరిశీలించారు. సర్వే ప్రక్రియ, రైతుల స్పందన, అధికారుల సమన్వయం తదితర అంశాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా రైతుల అభిప్రాయలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తచెరువు రూరల్: కొత్తచెరువు మండల పరిధిలోని నారేపల్లిలో ఉపాధి హామీ కింద చేపట్టిన ఫారంఫాండ్లు, ఉద్యానవన పంటలు, డ్రిప్ సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు. పథకాల అమలు పరిస్థితులను రైతులను, అధికారులను తెలుసుకున్నారు.

రెండున్నర కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - గుంతకల్లు

అనంతపురం జిల్లా గుంతకల్లు రైల్వే హాస్పిటల్ వద్ద ఉన్న రైల్వే క్వార్టర్స్ లో ముళ్లపొదల్లో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయన్న సమాచారంతో దాడులు చేసి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రెండున్నర కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఒకటవ పట్టణ సిఐ బి మనోహర్ తెలిపారు. మంగళవారం స్థానిక ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక గంగానగర్‌కు యాషర్ అలీ అలియాస్ ఉజిత్ అలీ, షేక్ మొహమ్మద్ అనే షికారిలు మహారాష్ట్రలోని తానే జిల్లా కోస పట్టణం మురముర రైల్వే స్టేషన్ నుంచి గుర్తుతెలియని వ్యక్తులతో గంజాయి కొనుగోలు చేసి గుంతకల్లు తీసుకువచ్చారన్నారు. ఆ గంజాయి చిన్న చిన్న పొట్లాలుగా చేసి రైల్వే స్టేషన్ ఏరియాలో అమ్మకాలు చేసి ఎక్కువ డబ్బులు సంపాదించాలని పథకం వేశారన్నారు. పక్కా సమాచారంతో దాడులు చేసి వారిని అదుపులోకి తీసుకుని రెండున్నర కేజీల గంజాయి, 1100 రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారని వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని చెప్పారు. నిందితులను కోర్టులో హాజరు పరస్తామన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ కొండయ్య, పోలీసులు పాల్గొన్నారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

నేడు 'రైతన్నా మీకోసం' వారోత్సవాలు

ప్రజాశక్తి-హిందూపురం

రైతన్నా మీకోసం' అనే కార్యక్రమం కింద చేపట్టిన ఇంటింటా సర్వేలో భాగంగా బుధవారం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి సురేంద్రనాయక్ తెలిపారు. రైతుల ఇంటింటా సర్వే గత నెల 24వ తేదీ నుండి ఈనెల రెండవ తేదీ వరకు నిర్వహించామన్నారు. రైతన్నా మీకోసం వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో ఉదయం 10.30 గంటలకు గ్రామసభ నిర్వహించడం జరుగుతుందని, మండలంలోని రైతు సేవా కేంద్రం పరిధిలో ఉన్న ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో అధ్యాపకుడు

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని ప్రయివేట్ జూనియర్ కళాశాల బోటనీ అధ్యాపకుడు సోమశేఖర్ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్నారు. ఒక ప్రయివేట్ కంపెనీ సెల్స్ గర్ల్‌గా నటించిన దుండగులు ఫోన్ పనిచేయడం లేదని చెప్పి ఆయన సెల్‌ఫోన్ తీసుకున్నారు. అనంతరం ఐదు నిమిషాల్లోనే ఆయన క్రెడిట్ కార్డు నుంచి రూ.7,500 తస్కరించినట్లు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యులు

హాస్టళ్లలో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

ఎస్టీ కమిషన్ సభ్యులు పి.వెంకటప్ప

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో ఉన్న గిరిజన సంక్షేమ, గురుకుల హాస్టళ్లలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు పి.వెంకటప్ప సూచించారు. ఈ మేరకు ఆయన మంగళవారం నగరంలోని రోడ్లు భవనాల అతిథి గృహంలో గిరిజన శాఖ అధికారులు, ప్రిన్సిపల్స్, హాస్టల్స్ వార్డెన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందరంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న గిరిజన గురుకుల పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, హాస్టల్లో ఎటువంటి సమస్యలు లేకుండా మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. గిరిజన గురుకుల హాస్టళ్లను శుభ్రంగా ఉంచుకోవాలని వార్డన్లకు సూచించారు. విద్యార్థులు పట్ల వార్డెన్లు, ప్రిన్సిపాల్స్ నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. పదవ తరగతి విద్యార్థులు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఈ సంవత్సరం ఉత్తీర్ణత శాతం పెరగాలని తెలిపారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసులు రావు, ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే వీరాంజనేయులు, ప్రిన్సిపాల్స్, హాస్టల్ వార్డెన్లు, రవీంద్ర నాయక్, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లపై అవగాహన

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్, ఇతర అంశాలపై స్థానిక ఎన్‌జిఒ హోంలో పెన్షనర్లకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.పెద్దన్నగౌడ్, శీలా జయరామప్ప తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనంతపురం జిల్లా ఖజానా కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ జి.రమణయ్య సూచనల మేరకు ప్రతి సంవత్సరం పెన్షనర్‌లకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు, ఇతర అంశాలు, సమస్యల గురించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ సదస్సులో పెన్షనర్లు పాల్గొని అవగాహన పెంపొందించుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని చౌడేశ్వరి కాలనీ వద్ద మంగళవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఉమాపతి అనే వృద్ధుడికి తగలడంతో ఆయన తీవ్ర గాయాల పాలయ్యారు. స్థానికులు 108 అంబులెన్స్ కి సమాచారం ఇవ్వగా 108 అంబులెన్స్ లో హిందూపురం ప్రభుత్వాసుపత్రికి క్షతగాత్రుడైన ఉమాపతిని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని తెలపడంతో ఉమాపతి కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం బెంగుళూరు ఆస్పత్రికి తరలించారు. ఉమాపతి చౌడేశ్వరి కాలనీ కు చెందిన వ్యక్తిగా పోలీసులు తెలిపారు.

తాడిపత్రి తహశీల్దార్‌గా ట్రయినీ ఐఎఎస్

తాడిపత్రి రూరల్ : తాడిపత్రి తహశీల్దార్‌గా అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్‌ను నియమించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మూడు నెలల కిందట ఇక్కడ రెగ్యులర్ తహశీల్దార్‌గా పని చేసిన మునివేలు బదిలీపై వెళ్లడంతో ఉన్నతాధికారులు ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా సోమశేఖర్‌ను నియమించారు. ఈనేపథ్యంలో ఐఎఎస్, అసిస్టెంట్ కలెక్టర్‌గా పని చేస్తున్న సచిన్‌రహార్ తహశీల్దార్‌గా నియమించారు.

పోస్టల్ లైఫ్‌ఇన్సూరెన్స్ కింద రూ.5.57 లక్షలు అందజేత

ప్రజాశక్తి-హిందూపురం

తపాలా శాఖ ద్వారా బీమా పొందిన వ్యక్తి మృతి చెందడంతో ఆ కుటుంబానికి తపాలా శాఖ అధికారులు రూ.5.57 లక్షల విలువైన చెక్కును మంగళవారం అందజేశారు. రొళ్ల మండలానికి చెందిన ఎం. శివకుమార్ ఈ ఏడాది జనవరి 23వ తేదీన విద్యుదాఘాతంతో మృతిచెందాడు. శివకుమార్ గత 2023 ఏప్రిల్ 20వ తేదీన తపాలా శాఖలో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్నారు. ఈ పాలసీ మొత్తం రూ. 5 లక్షలు కాగా అర్థ సంవత్సరానికి రూ.16,990 ప్రీమియంతో ఉండగా శివకుమార్ 4 వాయిదాల కింద మొత్తం రూ.67,960 ప్రీమియం మాత్రమే చెల్లించాడు. పాలసీలో మృతుడి భార్య మాలతిని నామినీగా నమోదు చేశారు.శివకుమార్ మృతి అనంతరం హిందూపురం తపాలా శాఖ ఈ ఏడాది అక్టోబర్ 14వ తేదీన డెత్ క్లైమ్‌ను ప్రత్యుత్తరాలు జరిపి కర్నూలు రీజినల్ కార్యాలయానికి గత నెల 25వ తేదీన క్లైమ్‌ను సర్వీసు చేసి నిర్ణయం అందజేసింది. దీంతోబీమా మొత్తం రూ.5,57,663 మంజూరు కావడంతో నామిని మాలతికి చెక్కును తపాలా శాఖ పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ పోస్ట్‌మాస్టర్ శ్రీ మార్కండేయ, హిందూపురం డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ మల్లికార్జున, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మృతుని భార్యకు చెక్కును అందజేస్తున్న అధికారులు

పిపిపిని వ్యతిరేకిస్తూ వైసిపి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-బత్తలపల్లి

వైద్య కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ మంగళవారం వైసిపి ఆధ్వర్యంలో మండలం లోని ఈదులముష్టూరు గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. వైసిపి నాయకులు నరసింహారెడ్డి మాట్లాడుతూ వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ చేస్తే పేద విద్యార్థులకు వైద్య విద్య, ప్రజలకు వైద్యం భారం అవుతుందన్నారు. కావున ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి పిపిపి విధానం వల ఎదురయ్యే సమస్యలను ప్రజలకు వివరించి సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో నాయకులు పాటిల్ ఓబిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చిట్టిబాల మనోహర్‌రెడ్డి, కుమ్మర శ్రీరాములు, బోయ సాంబశివుడు, కొట్టాల నరసప్ప, చంద్ర, సాంబశివుడు. పెద్దన్న, ఈశ్వరయ్య, కాటమయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడిమర్రి : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మండలంలోని రామాపురం గ్రామంలో సర్పంచి కుంటాల పుల్లయ్య ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు శంకరయ్య, కప్పల రాజగోపాల్, కార్యకర్తలు పాల్గొన్నారు.



తాడిమర్రిలో సంతకాల పేపర్లను చూపుతున్న దృశ్యం



పోతుకుంటలో స్వచ్ఛ భారత్ ర్యాలీ చేపట్టిన విద్యార్థులు

పోతుకుంటలో విద్యార్థుల శ్రమదానం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ధర్మవరం రూరల్ పరిధిలోని పోతుకుంట గ్రామంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ధర్మవరం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. రెండో రోజైన మంగళవారం ఎన్ఎస్ఎస్ డైరెక్టర్ డా. డి.మల్లికార్జున, ప్రిన్సిపల్ జెవి.సురేష్‌బాబు పర్యవేక్షణలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. రామాలయం నుంచి మసీదు వరకూ పరిసరాలతో పాటు ఆర్‌డిటి పాఠశాల, ప్రభుత్వ పాఠశాలలు, అంజనేయస్వామి ఆలయం, వెంచర్ కాలనీ, గుడివీధి, తదితర ప్రాంతాల్లో చెత్త, వ్యర్థ పదార్థాలను తొలగించి శుభ్రం చేశారు. పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి ప్రజలకు పరిశుభ్రత, దోమల నివారణ, ఆరోగ్య సురక్షిత చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచి ఎ.నాగవేణి, పంచాయతీ కార్యదర్శి రామగౌని, మురళీగౌడ్, అంగజాల రాజశేఖర్ పాల్గొని వారి సేవలను అభినందించారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని అరవింద్ నగర్, విద్యుత్ నగర్, కమలానగర్, జనశక్తి నగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం చేపట్టిన పారిశుధ్య పనులను కమిషనర్ బాలస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ బాలస్వామి మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలించినట్లు తెలిపారు. అలాగే పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అనంతరం బళ్లారి రోడ్డులోని అన్న కాంటీన్‌ను తనిఖీ చేసి ప్రజలతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వెంకటేష్, రామాంజినేయులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేపు టెంకాయల విక్రయానికి వేలం

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని తొండపాడు గ్రామంలో వెలిసిన బోలికొండ రంగనాథ స్వామి ఆలయంలో టెంకాయల విక్రయ హక్కు కోసం ఈనెల 4న వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారిణి ఎస్.శోభ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనాలనుకునేవారు దేవాదాయ అధికారి వద్ద రూ.50వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని కోరారు.

పారిశుధ్య కార్మికురాలి కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-అనంతపురం

రుద్రంపేట పంచాయతీ పారిశుధ్య కార్మికురాలు నారాయణమ్మ కుటుంబానికి ఎంఎస్ఎస్ సేవాసంస్థ ఆర్థికసాయం అందజేసింది. నారాయణమ్మ భర్త మంగళవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంఎస్-ఎస్ సేవాసంస్థ అధ్యక్షులు సాదిక్‌వలి, స్థానిక ఎంపిటిసి మహబూబ్‌బీ నారాయణమ్మ ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తక్షణ సాయం కింద రూ.5వేల నగదు అందజేశారు.

12వ వేతన సవరణ కమిటీ వేయాలి

గుంతకల్లు : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంతోపాటు 12వ వేతన సవరణను అమలు చేయాలని ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని వివిధ పాఠశాలల్లోని ఉపాధ్యాయులతో ఎస్‌టియు నాయకులు సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఏకీకృత సర్వీసు రూల్స్ అమలు చేయాలని, పదోన్నతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జి.మల్లికార్జున, జిల్లా నాయకులు సుధాకర్, జిల్లా నాయకులు సుధాకర్, నాయకులు గంగాధర్, చిరంజీవి, లక్ష్మీనారాయణ, దేవరకొండ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-నల్లమాడ

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం-2025లో భాగంగా మంగళవారం నల్లమాడలో ర్యాలీ నిర్వహించారు. 'మనపంతం ఎయిడ్స్ అంతం', 'ఎయిడ్స్ మహమ్మారిని పారదోలుదాం' అంటూ నినాదాలు చేస్తూ బస్టాండ్ కూడలి చేరుకుని అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ఎయిడ్స్ సంక్రమణ, లక్షణాలు, నివారణ మార్గాలు, మందుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎయిడ్స్ బాధితుల పట్ల ఎలాంటి వివక్ష, చిన్నచూపు మంచిది కాదన్నారు. అనంతరం ఎయిడ్స్ నియంత్రణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.శ్రీనివాసులు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎం.రామచంద్ర, ప్రభుత్వ వైద్యులు డా. అజయ్ కుమార్ రెడ్డి, నందినిబాయి, అశృన్నీసా, దీప్తి, సిహెచ్‌సి డైరెక్టర్ నాగభూషణ్‌నాయుడు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, జన జాగృతి సభ్యులు, జూనియర్ కాలేజీ లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సదరం క్యాంపునకు వచ్చిన వృద్ధులకు మంగళవారం సూర్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ట్రస్ట్ యాజమాన్యం లక్ష్మీదేవి మాట్లాడుతూ తనకున్న కొద్దిపాటి ఆస్తిని అమ్మేసి మహమ్మదాబాద్ గ్రామంలో ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. అందులో అనాథలు, వృద్ధులకు ఆశ్రయం ఇస్తున్నామన్నారు. దాతలు ఆశ్రమానికి సహాయ, సహకారాలు అందించాలని కోరారు.

శ్మశానవాటికకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-ముదిగుబ్బ

తహశీల్దార్ నారాయణస్వామి ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని గాండ్లవారిపల్లి గ్రామంలో శ్మశానవాటిక కోసం స్థలాన్ని పరిశీలించారు. మండల సర్వేయర్ సుశాంతి సర్వే సిబ్బందితో కలిసి సర్వే నెంబర్-151లో కొలతలు చేపట్టారు. శ్మశానవాటికకు కేటాయించిన స్థలాన్ని గుర్తించారు.

రైతులకు యూరియా పంపిణీ

ప్రజాశక్తి-అమడగూరు

మండలంలోని మహమ్మాదాబాద్ సొసైటీ కార్యాలయంలో మంగళవారం ఛైర్మన్ కమ్మల నరేష్ ఆధ్వర్యంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఛైర్మన్ మాట్లాడుతూ యూరియా, కాంప్లెక్స్, డిఎపి, తదితర ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచుతామన్నారు. రైతులు ఎరువులు లేవని అపోహ పడొద్దన్నారు. యూరియా 280 బ్యాగులు రాగా రూ. 280 చొప్పున మొత్తం పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ ఛైర్మన్ కమ్మల వెంకటశేషయ్య, ఎఇఒ రమేష్‌నాయక్, అగ్రికల్చర్ అసిస్టెంట్ బాబ్‌జాన్, రైతులు పాల్గొన్నారు.



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న సొసైటీ ఛైర్మన్ నరేష్, నాయకులు

తరువాయి 3లో..

సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్



లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న పరిటాల శ్రీరామ్

నియోజకవర్గ పరిధిలో ప్రయివేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను మంగళవారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పట్టణం లోని తన వ్యక్తిగత కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఏడుగురికి రూ. 4.77 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. శ్రీరామ్ మాట్లాడుతూ కొన్ని సందర్భాల్లో పేదలకు ఎన్టీఆర్ వైద్య సేవలు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటి వారిని దృష్టిలో ఉంచుకొని సిఎం చంద్రబాబు పార్టీలకు అతీతంగా సిఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థికసాయం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు సందా రాఘవ, పరిసే సుధాకర్, నాగూర్ హుస్సేన్, పురుషోత్తంగౌడ్, మహేష్ చౌదరి, షరీఫ్, మాధవరెడ్డి, చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్



పుట్టపర్తిలో సిఐటియు జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4వ తేదీ వరకూ జరిగే సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎల్.నరసింహులు పిలుపు నిచ్చారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని సిఐటియు కార్మిక, కర్షక భవనంలో మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. నరసింహులు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా గత మూడళ్లలో చేపట్టిన పోరాటాలపై సమీక్ష చేయడంతో పాటు భవిష్యత్తులో కార్మికుల కోసం చేపట్టాల్సిన పోరాటాలపై మహాసభలో కార్యాచరణ రూపొందిస్తారన్నారు. మహాసభల ముగింపు రోజు నిర్వహించే ప్రదర్శనలో జిల్లాలోని గోపాలమిత్ర ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గోపాలమిత్ర అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నిజాంవలి, కార్యదర్శి వైకుంఠవాసులు, నాయకులు ఇస్మాయిల్, హరిప్రసాద్, హనుమంతరాయప్ప, సిఐటియు జిల్లా కార్యదర్శి పైపల్లి గంగాధర్, కోశాధికారి నల్ల లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిఐటియు మండల కార్యదర్శి రామచంద్ర ఆధ్వర్యంలో సిఐటియు నాయకులు, ఆశా కార్మికులు సిఐటియు అఖిల భారత మహాసభల గోడపత్రాలు విడుదల చేశారు. రామచంద్ర మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబి స్తుందని మండిపడ్డారు. కార్మిక చట్టాలను కుదించి లేబర్ కోడ్‌లుగా మార్చడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరంగి ప్రవీణ్‌కుమార్, ఆశా కార్మిక సంఘం నాయకులు శోభారాణి, అంజనమ్మ, లక్ష్మీదేవి, వెంకటరత్నమ్మ, పవిత్ర, సువర్ణమ్మ, పార్వతమ్మ, మంజుల, నాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : తనకల్లులో సిఐటియు ఆధ్వర్యంలో అఖిల భారత సిఐటియు 18వ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ మహాసభలకు కార్మికులు, కర్షకులు, పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు శివన్న, రవాణా రంగం నాయకులు నరసింహారెడి, భవన నిర్మాణ కార్మికులు వెంకటేష్, గోవిందు, శ్రీనివాసులు, రైతు సంఘం నాయకులు వివి.రమణ, ఎస్‌వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి www.prajasakti.com

'వైపి రమేష్.. నోరుఅదుపులో పెట్టుకో'..

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

మాజీ మున్సిపల్ ఛైర్మన్ వైపి రమేష్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని వైసిపి నాయకులు హెచ్చరించారు. మంగళ వారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య అన్యాయం జరిగితే స్పందిస్తాడని.. ఆధర్మం జరిగితే ప్రత్యక్షమవుతాడన్నారు. ప్రజలకు జరిగే అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రతిపక్ష నాయకుడిగా రంగయ్య ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అలాంటి వ్యక్తిపై విమర్శలు చేయడం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో పట్టణ, రూరల్ కన్వీనర్లు సుధీర్, గోళ్లసూరి, కౌన్సిలర్ లక్ష్మన్న, నాయకులు, పరమేశ్వరప్ప, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

గన్నేవారిపల్లి కాలనీలో ఎమ్మెల్యే పర్యటన

తాడిపత్రి రూరల్ : తాడిపత్రి రూరల్ పరిధిలోని గన్నవారిపల్లి కాలనీలో ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని పలువీధుల్లో కలియ తిరుగుతూ ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీలో నీరు, విద్యుత్ తదితర సమస్యలు లేకుండా సత్వరమే పరిష్కరం చూపేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గన్నేవారిపల్లి 1, 2వ సచివాలయాల అధికారులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విషజ్వరాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-నార్పల

ప్రతి ఒక్కరూ విషజరాలపై అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య సూచించారు. మంగళవారం మండల పరిధిలోని బి.పప్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ సునీత ఆధ్వర్యంలో ఆశా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే ఆశా కార్యకర్తలు ముఖ్యపాత్ర వహించాలన్నారు డ్రైడే ఫ్రైడే కార్యక్రమాల్లో ప్రతి శుక్రవారం ఆశాలు ప్రతిఇంటికీ వెళ్లి లార్వా సర్వే చేయాలన్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సూపర్‌వైజర్లు శ్రీధర్‌మూర్తి, నూర్‌బాషా, తదితరులలు పాల్గొన్నారు.

ఎడిసిని బదిలీ చేయాలని వినతి

ప్రజాశక్తి - రాయదుర్గం

రాయదుర్గం ఆర్టీసీ బస్సు డిపోలో పని చేస్తున్న అసిస్టెంట్ డిపో క్లర్క్ (ఎడిసి)ని బదిలీ చేయాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈమేరకు మంగళవారం స్థానిక డిపో మేనేజర్ కార్యాలయంలో అసోసియేషన్ డిపో కార్యదర్శి హెచ్.తిప్పేస్వామి, అధ్యక్షులు రామాంజనేయులు తదితరులు డిపో మేనేజర్ జె శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎడిసి రెండేళ్లుగా పదవిలో కొనసాగుతూ ఉద్యోగుల డ్యూటీ చార్ట్ విషయంలో ఒక యూనియన్‌కు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కావున వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు సతీష్‌కుమార్, రాఘవ, నాగరాజు, రవికుమార్ నాయక్, సిద్దేశులు, మాలిక్‌బాషా, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం

ప్రజాశక్తి - రాయదుర్గం రూరల్

ప్రస్తుత పరిస్థితుల్లో కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కంప్యూటర్ అప్లికేషన్స్ , కంప్యూటర్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. కంప్యూటర్ అప్లికేషన్స్ అధ్యాపకురాలు ఫరీసా ఫిర్దోస్ మాట్లాడుతూ నేటి ప్రపంచంలో ఏ వృత్తిలోనైనా కంప్యూటర్ ఉపయోగం తప్పనిసరి అయిందన్నారు. కాగా ఆన్‌లైన్ మోసాలు ఎక్కువైనా ఈ రోజుల్లో సరైన జ్ఞానం ద్వారా కంప్యూటర్‌ను సమర్థవంతంగా ఉపయోగించడం ప్రధానమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, అధ్యాపకులు అమీర్‌హుస్సేన్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

ఆయా గ్రామాల్లోని ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కళ్యాణదుర్గం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ తిరుపాలయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గుడిపల్లి గ్రామంలో వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా తిరుపాలయ్య మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తుగా గ్రామంలో ఇంటింటికీ తిరిగి లార్వాలు తొలగిస్తున్నామన్నారు. అదేవిధంగా ప్రతి శుక్రవారం డ్రైడే చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ జాన్సన్, పంచాయతీ సెక్రటరీ యోగేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ రమేష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ తిరుపతయ్య, ఎంఎల్‌హెచ్‌పి మృదుల, ఆశా కార్యకర్తలు మాదేవి, ప్రమీల, మంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌కె సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-కణేకల్లు

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై కణేకల్లు, బొమ్మనహాల్, డి.హీరేహాల్ ఆర్ఎస్‌కె సిబ్బందికి మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ బ్రహ్మయ్య, సివిల్ సప్లయ్ డిఎం రమేష్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు ఎవరూ నష్టపోకుండా ప్రతి రైతు వరిధాన్యం కొనుగోలు చేసే విధంగా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ జెడి ఉమామహేశ్వరమ్మ, ఎఎం జనరల్ ప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్ ముఖేష్, ఎఒ రమేష్, రెవెన్యూ అధికారులు పవన్‌కుమార్, రెవెన్యూ అధికారులు పవన్‌కుమార్, రుద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియులో జాబ్‌మేళా

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను జెఎన్‌టియు విసి హెచ్.సుదర్శనరావు మంగళవారం అభినందించారు. డెక్కన్ ఫైన్ కెమికల్స్ ప్రయివేట్ లిమిటెడ్ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 8 మంది విద్యార్థులు రూ.4.75 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. దీంతో వారిని విసి అభినందించారు. అభినందించిన వారిలో రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఒఎస్‌డి విసి ఎన్.దేవన్న, పిఆర్.భానుమూర్తి, డైరెక్టర్ అఫ్ ఇండస్ట్రియల్, ప్లేస్‌మెంట్ ఆర్.కిరణ్మయి, కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, ప్రాంగణ నియామకాల అధికారి జె.శ్రీనివాసులు ఉన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ధర్నా

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని హిందూపురం రోడ్డులో మరమ్మతులు చేపట్టాలని కోరుతూ మంగళవారం సిపిఐ, ఎఐటియు, బికెఎంయు ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ ప్రధాన రహదారిలో గుంతలు ఏర్పడడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ విషయంపై పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, లేనిచో రహదారులను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పవన్, కదిరిప్ప, మధునాయక్, అసన్, ఆదెప్ప, చంటి, రమేష్, రామ్మోహన్, శీనా, పీరు నాయక్, శ్రీనివాసులు, మహేష్, రఘు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కల రైతులకు అవగాహన

ప్రజాశక్తి-గాండ్లపెంట

పండ్ల మొక్కలు సాగు చేసే రైతులకు మంగళవారం మండలంలోని కటారుపల్లి క్రాస్ వద్ద ఉన్న రెడ్స్ సంస్థ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీవో వివిఎస్.శర్మ, అగ్రికల్చర్ ఎడిఎ సనావుల్లా, రెడ్స్ సంస్థ అధినేతలు భానుజ, ఉమేష్, అరుణ్ కుమార్ హాజరై మాట్లాడారు. మండలంలో సుమారు నాలుగేళ్ల నుంచి రెడ్స్ సంస్థ సహకారంతో రైతులకు 4 లక్షల పండ్ల మొక్కలు పంపిణీ చేశామని తెలిపారు. అనంతరం రైతులకు అవగాహన కల్పించి, 125 మంది రైతులకు పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు పథకాలను వర్తింపజేయాలి

ప్రజాశక్తి-అనంతపురం



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలను వర్తింపజేసేందుకు వ్యవసాయ అధికారులు కృషి చేయాలని ఎపి కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, ఉరవకొండ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, వెంకటేశులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో ఉరవకొండ మండల కేంద్రంలోని ఎడిఎ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉరవకొండ నియోజవర్గంలో కౌలు రైతులందరికీ బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి ఆదుకోవాలన్నారు. అలాగే కౌలు రైతు పంటలు ఈ క్రాప్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం అధ్యక్ష ఎ.రంగరెడ్డి, కౌలు రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి మధుసూదన్‌నాయుడు, నాయకులు జి.సీనప్ప, జ్ఞానమూర్తి, రామాంజనేయులు, నాగవేణి, సుంకన్న, తిప్పమ్మ, భారతి, ఆంజనేయులు, కుళ్లాయప్ప, నాగన్న, అనసూయమ్మ, ఎర్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

51	3-1-0133	జి నంజప్ప	బసప్ప	L6	హిందూపూర్ పార్టు-III	
52	3-1-0133	జి నంజప్ప	బసప్ప	L6A	హిందూపూర్ పార్టు-III	
53	3-1-0136	కె యాకూబ్	ఇబ్రహీం సబ్	L8	హిందూపూర్ పార్టు-III	
54	3-1-0137	కె చంద్రశేఖర్	ఇబ్రహీం సబ్	L9	హిందూపూర్ పార్టు-III	
55	3-1-0138, 139,140	కె చంద్రశేఖర్	ఇబ్రహీం సబ్	L9A	హిందూపూర్ పార్టు-III	
56	3-1-0141	జగదీష్ బాబు	జి నాగరాజు	L10	హిందూపూర్ పార్టు-III	
57	3-1-0142	ఇర్షాద్ అహ్మద్	అల్లాబకాష్	L11	హిందూపూర్ పార్టు-III	
58	3-1-0142	పి.ఎం.నాసిర్ హుస్సేన్	పి ఎం పీర్ సబ్	L11A	హిందూపూర్ పార్టు-III	
59	3-1-0142	పి.ఎం.నాసిర్ హుస్సేన్	పి ఎం పీర్ సబ్	L11A	హిందూపూర్ పార్టు-III	
60	3-1-143/A	పి.ఎం.నాసిర్ హుస్సేన్	పి ఎం పీర్ సబ్	L12A	హిందూపూర్ పార్టు-III	
61	3-1-0144	జి శ్రీనివాసులు	జి తిప్పయ్య	L13	హిందూపూర్ పార్టు-III	
62	3-1-0144	జి శ్రీనివాసులు	జి తిప్పయ్య	L13A	హిందూపూర్ పార్టు-III	
63	3-1-144/1	జి రాధమణి	జి తిప్పయ్య	L14	హిందూపూర్ పార్టు-III	
64	3-1-0145	ATP జిల్లా కో-ఆప్ బ్యాంక్	ATP జిల్లా కో-ఆప్ బ్యాంక్	L15	హిందూపూర్ పార్టు-III	
65	3-1-0149	శంకరమ్మ & గంగాధరయ్య	గంగాదరయ్య	L16	హిందూపూర్ పార్టు-III	
66	3-1-0150	బి ఎస్ అల్లబకాష్	ఎస్.ఎ. బషీర్	L17	హిందూపూర్ పార్టు-III	
67	3-1-0150	రఫీక్	ఎస్.ఎ. బషీర్	L18	హిందూపూర్ పార్టు-III	
68	3-1-0150	రియాజ్	ఎస్.ఎ. బషీర్	L19	హిందూపూర్ పార్టు-III	
69	3-1-0151	అబ్దుల్ ఘని	రసూల్ ఖాన్	L20	హిందూపూర్ పార్టు-III	
70	3-1-0152	రిహానా బేగం	అబ్దుల్ గని	L21	హిందూపూర్ పార్టు-III	
71	3-1-0153	కె సైఫుల్లా ఖాన్	ఇస్మాయిల్ సబ్	L22	హిందూపూర్ పార్టు-III	
72	3-1-0154	ఎం ఖలీమ్ ఖాన్	యూసుఫ్ ఖాన్	L23	హిందూపూర్ పార్టు-III	
73	3-1-0155	ఎం సాదిక్ ఖాన్	యూసుఫ్ ఖాన్	L24	హిందూపూర్ పార్టు-III	
74	3-1-0155A	నరసింహ మూర్తి	బి శ్రీనివాసులు	L25	హిందూపూర్ పార్టు-III	
ప్రభావిత రేవిన్యూ సర్వే నంబర్లు : 72,78,79,83						
75	# 6-1-74	పి.ఎన్.జిక్రియ (సైఫుల్లా)	పి. నబీసాబ్	R47	హిందూపూర్ పార్టు-II	
76	# 6-1-73	దిల్షాద్ బాను	దివంగత ఇక్బాల్ భాషా	R48	హిందూపూర్ పార్టు-II	W.P.8602/2021 filed in Hon'bel High Court of A.P., for compensation
77	6-1-7a	ఫాజిల్ (ఖాదర్ ఖాన్)	హయత్ ఖాన్	R48A	హిందూపూర్ పార్టు-II	
78	6-1-7a	ఎన్ ఎ మహమ్ముద్దీన్ బీ	ఖాదర్ ఖాన్	R49	హిందూపూర్ పార్టు-II	
79	6-1-72, 72 a.b.c	సి.ఆంజినేలుయు	సి.లక్ష్మినారాయణ	R50A	హిందూపూర్ పార్టు-II	
80	# 6-1-71	షాన్వాజ్	ఎన్.బాబ్ జాన్	R50B	హిందూపూర్ పార్టు-II	
81	6-1-68, 69,70	ఎస్. రఫీవుల్లా ఖాన్, ఎస్.నియాజుల్లా ఖాన్	హయత్ ఖాన్	R51	హిందూపూర్ పార్టు-II	
82	6-1-68 69,70	ఎస్. రఫీవుల్లా ఖాన్, ఎస్.నియాజుల్లా ఖాన్	హయత్ ఖాన్	R52	హిందూపూర్ పార్టు-II	
83	6-1-67a	షాజీదున్ని సా (షేజాతున్నిసా)	హఫీజ్‌జి	R53	హిందూపూర్ పార్టు-II	W.P.8602/2021 filed by M Dhanunjineyulu in Hon'bel High Court of A.P., for compensation
84	కాంపౌండ్ వాల్	షాజిదా బేగం	NA	R54	హిందూపూర్ పార్టు-II	
85	6-1-67b	ఎన్.ఎ. బషీర్	దివంగత అబ్దుల్ జలీల్ సబ్	R55	హిందూపూర్ పార్టు-II	
86	# 6-1-67	ఎస్. అబ్దుల్ వాహిద్	అబ్దుల్ గుఫర్ సాబ్	R56	హిందూపూర్ పార్టు-II	W.P.8602/2021 filed in Hon'bel High Court of A.P., for compensation
87	6-1-6a, 6-6-2-229	హెచ్ సమియుల్లా	NA	R57	హిందూపూర్ పార్టు-II	
88	6-2-231	ఎస్. రాజేశ్వరి	కె. శేఖర్	R58	హిందూపూర్ పార్టు-II	W.P.8602/2021 filed in Hon'bel High Court of A.P., for compensation
89	డోర్ నంబర్ లేదు	దేవరాజు (దంత వైద్యశాల)	బి ఆనంద్	R60	హిందూపూర్ పార్టు-II	W.P.8602/2021 filed in Hon'bel High Court of A.P., for compensation
91	7-1-62 d-1	నంజుండప్ప	జి.నాగప్ప	R62	హిందూపూర్ పార్టు-II	
92	7-1-62c	నంజుండప్ప (జి కుసుమ)	జి.నాగప్ప	R63	హిందూపూర్ పార్టు-II	
93	7-1-61/b-2	జి కుసుమ	నంజుండప్ప	R64	హిందూపూర్ పార్టు-II	
94	# 7-1-61 /B-1	ఎన్ నాగార్జున	నారాయణ స్వామి	R65	హిందూపూర్ పార్టు-II	
95	# 7-1-61A	ఎన్.ఎస్. కృష్ణమూర్తి	ఎన్. సీతారామయ్య	R66	హిందూపూర్ పార్టు-II	
96	# 7-1-57	జి చరణ్ కుమార్ (జి తిప్పేస్వామి)	జి.శివ కుమార స్వామి	R67	హిందూపూర్ పార్టు-II	
97	# 7-1-60	డి.ఎ.బద్రినాథ్	జి.ఎన్.శేశయ్య	R68	హిందూపూర్ పార్టు-II	
98	# 7-1-59A	డి.ఎం. కృష్ణమూర్తి	దేవాంగం మల్లప్ప	R69	హిందూపూర్ పార్టు-II	
99	# 7-1-59	మల్లికా	చంద్రశేఖర	R70	హిందూపూర్ పార్టు-II	
100	# 7-1-58	కె కుమార్ రెడ్డి	కె సుబ్బి రెడ్డి	R71	హిందూపూర్ పార్టు-II	
101	# 7-1-60/1	జి చరణ్ కుమార్ (జి తిప్పేస్వామి)	జి.శివ కుమారస్వామి	R72	హిందూపూర్ పార్టు-II	
102	7-1-55a	ఆర్ హెచ్ అనిల్ కుమార్	ఆర్ ఎస్ హనుమంతయ్య	R73	హిందూపూర్ పార్టు-II	
103	7-1-55c	ఎస్.సి.రాజు	బుడెన్సాబ్‌జి	R74	హిందూపూర్ పార్టు-II	
104	# 7-7-1	ఎ. నాగరాజు బి.కె. పార్థసారధి	ఆర్.వి.అప్ప స్వామి, బి.కె.నంజయ్య	R75	హిందూపూర్ పార్టు-II	
105	9-1-54.	ఆర్.ఎ.అరుణ్ కుమార్, ఆర్.ఎ.అనిల్ కుమార్	ఆర్ బి అశ్వర్ధనారాయణ	R76	హిందూపూర్ పార్టు-II	W.P.8602/2021 filed in Hon' bel High Court of A.P., for compensation
106	9-1-54c1	మధు & అనిత	చిక్క లింగే గౌడ్	R77	హిందూపూర్ పార్టు-II	W.P.8602/2021 filed in Hon'bel High Court of A.P., for compensation
107	9-1-54/c	ఎస్. లక్ష్మి సుదీర్	ఎస్. సుదీర్	R78	హిందూపూర్ పార్టు-II	W.P.8602/2021 filed in Hon'bel High Court of A.P., for compensation
108	9-1-54/2d	అదెమ్మ & చౌదమ్మ	జి నారాయణప్ప	R79	హిందూపూర్ పార్టు-II	
109	9-1-53A	ఎస్ నిర్మలదేవి	నరసింహయ్య	R80	హిందూపూర్ పార్టు-II	
110	9-1-52 & 25A	కె శంషాద్ బేగం	కె అన్వర్	R81	హిందూపూర్ పార్టు-II	
111	9-1-53B	కె అన్వర్	కె జలీల్సాబ్	R82	హిందూపూర్ పార్టు-II	
112	9-1-53C	కె అన్వర్	కె జలీల్సాబ్	R83	హిందూపూర్ పార్టు-II	
113	9-1-53a	కె ఎం మురళీకుమార్	కె ఎస్ ముద్దన్న	R84	హిందూపూర్ పార్టు-II	
114	9-1-34.	కె ఎం హరికుమార్	కె ఎస్ ముద్దన్న	R85	హిందూపూర్ పార్టు-II	
115	9-1-33.	పద్మమ్మ ,టి సురేష్, ఉష, కుశల్	దివంగత టి వెంకటేశులు, దివంగత టి శివశంకర్	R86	హిందూపూర్ పార్టు-II	
116	9-1-32.	ఎం జి రమేష్‌బాబు	టి ఎన్ రత్నెప్ప	R87	హిందూపూర్ పార్టు-II	
117	9-1-1/7b	ఎస్ వెంకటరమణ	ఎస్ వెంకటస్వామి	R88	హిందూపూర్ పార్టు-II	
118	9-1-17A	నారాయణ మూర్తి రమేష్ గీత శ్రీనివాసులు	లక్ష్మీనారాయణజి	R89	హిందూపూర్ పార్టు-II	
119	9-1-10.	కె నారాయణప్ప	కె నరసింహులు	R90	హిందూపూర్ పార్టు-II	
120	9-1-9-1	టి.దాసప్ప (టి రేణుకా దేవి)	దివంగత సి వెంకట రమణ	R91	హిందూపూర్ పార్టు-II	
121	9-1-8.	కె.ఎ. అమూల్య	కె ఎ శ్రీనివాసమూర్తి	R92	హిందూపూర్ పార్టు-II	
122	9-1-8.	జాన్సి రాణి	పిహెచ్ సూర్య నారాయణ	R93	హిందూపూర్ పార్టు-II	
123	9-1-6.	ఎస్ సాయినాథ్	ఎస్ శ్రీష్ణ	R94	హిందూపూర్ పార్టు-II	
124	9-1-5/18	ఎం రామలక్ష్మమ్మ	మల్లెం వెంకట రమణ	R95	హిందూపూర్ పార్టు-II	
125	9-1-6E, 9-1-5/m	సి. ఎస్. లక్ష్మీ నారాయణ	సి ఎస్ లక్ష్మీనారాయణ	R96	హిందూపూర్ పార్టు-II	
126	9-1-6b, 9-1-5/15.16	జి విజయరామేష్	జి ఎన్ రమేష్	R97	హిందూపూర్ పార్టు-II	W.P.8602/2021 filed in Hon'bel High Court of A.P., for compensation
127	9-1-5/ 14-1	సి ఎ లక్ష్మి	సి ఎం ఆది నారాయణ గుప్తా	R98	హిందూపూర్ పార్టు-II	W.P.8602/2021 filed in Hon'bel High Court of A.P., for compensation
128	9-1-5/14	సీఎం ఆది నారాయణ గుప్తా	ముద్దన్నజి	R99	హిందూపూర్ పార్టు-II	W.P.8602/2021 filed in Hon'bel High Court of A.P., for compensation
129	9-1-5/12	కె. తిమ్మయ్య, రాహుల్ గుప్తా	దివంగత వెంకటేష్ కుమార్	R100	హిందూపూర్ పార్టు-II	
130	9-1-5/12/a	ఆర్ చిన్నతిమ్మప్ప	రంగప్ప	R101	హిందూపూర్ పార్టు-II	W.P.8602/2021 filed in Hon'bel High Court of A.P., for compensation
131	9-1-1/a3	ఎం ఎ సంజన్ సెట్టి	కె అర్జున్	R102	హిందూపూర్ పార్టు-II	W.P.8602/2021 filed in Hon'bel High Court of A.P., for compensation
132	9-1-1.	ఆర్ ఆర్ విజయలక్ష్మి	రేవూరి రాధా కృష్ణయ్య	R103	హిందూపూర్ పార్టు-II	
ప్రభావిత రెవిన్యూ సర్వే నెంబర్లు:85,106, 108						
133	3-1-0159	పూజారి నాగన్న	పి సుబ్బరాయప్ప	L26	హిందూపూర్ పార్టు-II	
134	3-1-160/A	డి. నూరుల్లా ఖాన్	దస్తగిరి ఖాన్	L27	హిందూపూర్ పార్టు-II	W.P.8602/2021 filed in Hon'bel High Court of A.P., for compensation
135	3-1-160/B	గుల్జర్బి	షేక్ మున్నవర్	L28	హిందూపూర్ పార్టు-II	W.P.8602/2021 filed in Hon'bel High Court of A.P., for compensation

మిగతా 4లో..

అరటి రైతులను ఆదుకోవాలి

ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న

ప్రజాశక్తి-తాడిమర్రి

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా అరటి రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న డిమాండ్ చేశారు. మండలంలో రైతు లు సాగు చేసిన అరటి తోటలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 25 వేల ఎకరాలకు పైబడి అరటి పంట సాగవుతుందన్నారు. ఈ ఏడాది గిట్టుబాటు ధర లేక రైతులు ఎకరాకు రూ. లక్ష చొప్పున నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వాలు పంటల గిట్టుబాటు ధరపై చట్ట బద్ధత చేయడంలో, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో ఉమ్మడి జిల్లాలో ఈ 18 నెలల్లో దాదాపు 120 మంది రైతులు వివిధ రూపాల్లో ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. ఇకనైనా ప్రభుత్వం పంటల వారీగా



అరటి తోటను పరిశీలిస్తున్న ఎపి రైతు సంఘం నాయకులు

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని, ఎకరాకు రూ. లక్ష నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తాడిమర్రి మండలంలో కూడా రైతులు పెద్దఎత్తున అరటి పంట సాగు చేసి నష్ట పోయారన్నారు.

సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేద్దాం

విశాఖపట్నంలో జరిగే సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేద్దామని జంగాలపల్లి పెద్దన్న పిలుపునిచ్చారు. సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్మిక, కర్షకుల ఐక్యతతో పెట్టుబడిదారీ విధానాన్ని కూల్చి కార్మిక రాజ్యాన్ని స్థాపించడమే సిఐటియు లక్ష్యమన్నారు. దేశవ్యాప్తంగా కార్మిక వర్గాలను ఐక్యపరచడమే మహాసభ ఆశయమన్నారు. సోషలిజం ఒక్కటే నేటి సమస్యలకు సరైన మార్గమని, ఐక్య పోరాటం నినాదంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ నారాయణ, కో కన్వీనర్ భారతి, నాయకులు జి.లక్ష్మీనారాయణ, రైతు సంఘం మండల కార్యదర్శి పోతలయ్య, అంగన్వాడీ సిబ్బంది అలివేలు, జయలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఈ నెల 10వ తేదీ లోపు మున్సిపల్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని, లేనిచో 11వ తేదీ సమ్మె నోటీసు ఇస్తామని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ స్పష్టం చేశారు. పట్టణంలోని పిఆర్‌టి వీధిలోని వాటర్ ట్యాంక్ వద్ద మంగళవారం మున్సిపల్ కార్మిక సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు తల్లికి వందనంతో సహా అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలని, జీవో-36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని, ఆప్కాస్, కోవిడ్ అడిషనల్ కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల10వ తేదీలోపు వేతనాలు చెల్లించకపోతే 11వ తేదీ సమ్మె నోటీసు ఇస్తామని మున్సిపల్ కమిషనర్ సాయికృష్ణకు తెలిపారు. అలాగే విశాఖపట్నంలో ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకూ జరిగే సిఐటియు జాతీయ మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు అయూబ్‌ఖాన్, అనంతపురం జిల్లా మున్సిపల్ కార్మిక సంఘం కోశాధికారి ఆదినారాయణ, శ్రామిక మహిళా నాయకురాలు పెద్దక్క, రెగ్యులర్ కార్మిక సంఘం నాయకులు పుల్లన్న, మున్సిపల్ పట్టణ పారిశుధ్య ఇంజినీరింగ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.బాబు, ముకుంద, బొగ్గు నాగరాజు, అనిల్, దస్తగిరి, ఆప్కాస్, కోవిడ్ అడిషనల్ కార్మికులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్ సాయికృష్ణకు వినతి ఇస్తున్న మున్సిపల్ కార్మికులు


136	3-1-160/C	ఎస్ ఆంజినేయ బాబు	ఎస్ సంజీవప్ప	L29	హిందూపూర్ పార్టు-II	
137	3-1-0164	ఎస్.ఎ. బషీర్ సబ్	ఎస్ గఫార్	L30	హిందూపూర్ పార్టు-II	
138	3-1-164A	సి.ఇమామ్ ఖాన్ (చాంద్ భాషా)	షేక్ బషీర్ సాబ్	L31	హిందూపూర్ పార్టు-II	
139	3-1-0164	పెద్దారెడ్డి గారి సుధాకర్ రెడ్డి	రాజ శేఖర్ రెడ్డి	L32	హిందూపూర్ పార్టు-II	W.P.8602/2021 filed in Hon'bel High Court of A.P., for compensation
140	3-1-0164	పెద్దారెడ్డి గారి సుధాకర్ రెడ్డి	రాజ శేఖర్ రెడ్డి	L32	హిందూపూర్ పార్టు-II	
141	3-1-0184	ఎస్.ఎన్. శ్రీనివాసులు	ఎడిగ ఆదిలక్ష్మమ్మ	L33	హిందూపూర్ పార్టు-II	
142	4-1-185/A -13	షేక్ ఫర్హానా	కె యాకుబ్	L34	హిందూపూర్ పార్టు-II	
143	4-1-85d/ 1-b	ఎ మాలిని, వి. అనిత	అనీల్ కుమార్, వేణుగోపాల్	L35	హిందూపూర్ పార్టు-II	
144	4-1-0185	బి.వెంకటరమణ	దివంగత బి జె ఆదెప్ప	L36	హిందూపూర్ పార్టు-II	
145	4-5-25/16/1	టి శ్రీనివాసులు	టి నారాయణ స్వామి	L36A	హిందూపూర్ పార్టు-II	
146	4-1-0185	సి వెంకటేశ్వర్ రావు	ఎస్ చున్నపాపన్న	L37	హిందూపూర్ పార్టు-II	
147	4-1-0185	సి వెంకటేశ్వర్ రావు	ఎస్ చున్నపాపన్న	L38	హిందూపూర్ పార్టు-II	
148	4-1-185/d1,d2	ఎస్. శాంతమ్మ, ఎస్. ఉమాదేవి	ఎస్ సి బాబు	L39	హిందూపూర్ పార్టు-II	
149	4-1-185/ d1,d2	ఎస్. శాంతమ్మ, ఎస్. ఉమాదేవి	ఎస్ సి బాబు	L39A	హిందూపూర్ పార్టు-II	
150	4-1-185/ d1,d2	ఎస్. శాంతమ్మ, ఎస్. ఉమాదేవి	ఎస్ సి బాబు	L39B	హిందూపూర్ పార్టు-II	
151	4-1-0185	ఆర్ ఎ శ్రీధర్	ఆర్ అశ్వర్థ నారాయణ	L40	హిందూపూర్ పార్టు-II	W.P.8602/2021 filed in Hon'bel High Court of A.P., for compensation
152	4-1-185/d3	శశికళ	ఎన్ సుధాకర్	L41	హిందూపూర్ పార్టు-II	
153	4-1-185/d	రామచంద్ర గుప్తా	సి నరసింహయ్య	L42	హిందూపూర్ పార్టు-II	
154	4-1-185/d3	మీనాక్షి	వెంకట సుబ్రమణ్యం	L43	హిందూపూర్ పార్టు-II	W.P.8602/2021 filed in Hon'bel High Court of A.P., for compensation
155	4-1-185/d4	బేగం	నబీ రసూల్	L44	హిందూపూర్ పార్టు-II	
156	4-1-192/1	ఎస్.ఎం.సుజాత	ముర్గన్‌జి	L45	హిందూపూర్ పార్టు-II	
157	4-1-217A	హెచ్ నారాయణమ్మ	ఎన్ నాగేష్ రావు	L46	హిందూపూర్ పార్టు-II	
158	4-5-217D	మురళీధర్	అశ్వర్థనారాయణ శెట్టి	L47	హిందూపూర్ పార్టు-II	
159	4-5-217D	ఎస్ ఆర్ వెంకటేష్	ఎస్ ఎ రత్నయ్య	L48	హిందూపూర్ పార్టు-II	
160	4-1-220, 4-1-220D, 4-1-220B	ఎం వి కృష్ణమాచారి	ఎం వెంకట రమణాచారి	L49	హిందూపూర్ పార్టు-II	
161	4-1-0221	బి బద్రీనాథ్	పద్మనాభ గుప్తా	L50	హిందూపూర్ పార్టు-II	
162	4-1-0223	మధుసూధన్	పద్మనాభ గుప్తా	L51	హిందూపూర్ పార్టు-II	W.P.8602/2021 filed by Eswar Prasad in Hon'bel High Court of A.P., for compensation
163	4-1-0223	మధుసూధన్	పద్మనాభ గుప్తా	L51	హిందూపూర్ పార్టు-II	W.P.8602/2021 filed by Eswar Prasad in Hon%µ%bel High Court of A.P., for compensation

కమిషనర్, హిందూపురం పురపాలక సంఘం

అక్రమ మైనింగ్‌ను అరికట్టాలని వినతి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండల కేంద్రమైన నల్లమాడ సమీపంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను అరికట్టాలని మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పూల శివప్రసాద్ అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన పుట్టపర్తిలో గనులు భూగర్భ శాఖ అధికారి పెద్దిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. అంతకుమునుపు ఆయన జనసేనపార్టీ శ్రేణులతో కలిసి నల్లమాడ సమీపంలో నూతనంగా నిర్మించిన మార్కెట్ యార్డ్ భవనం సమీపంలో మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడి సిబ్బందిని ఆరా తీయగా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మైనింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించారు. దీనిపై జనసేన నాయకులు ప్రశ్నించగా వారిపై దాడికి యత్నించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని నల్లమాడ తహశీల్దార్‌తో పాటు మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారికి మైనింగ్‌కు ఒక హెక్టార్‌కు మాత్రమే అనుమతి ఉందని తెలిపారు. దీంతో అక్కడ మైనింగ్‌పై విచారణ చేసి నిజానిజాలను తేల్చాలని ఆయన మైనింగ్ ఉన్నతాధికారులను కోరారు. ఆయన వెంట జనసేనపార్టీ నల్లమాడ, ఓడిసి మండలాల కన్వీనర్లు మహేష్, మేకల ఈశ్వర్, టౌన్ జనరల్ సెక్రటరీ ఎస్.రాము, సెక్రటరీ ముత్యాల కరుణాకర్, నాయకులు ప్రభాకర్, మల్లికార్జున ఉన్నారు.



డ్రోన్లు, సీసీ కెమెరాలు ప్రదర్శిస్తున్న ఎస్పీ, కొరియన్ అసోసియేషన్ సభ్యులు

పోలీసు శాఖకు డ్రోన్లు, సీసీ కెమెరాలు వితరణ

ప్రజాశక్తి-పెనుకొండ

అసాంఘిక కార్యకలాపాలు, నేరాల గుర్తింపునకు డ్రోన్లు ఉపయోగకరంగా ఉంటాయని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని సిఐ కార్యాలయంలో మంగళవారం ఎపి కొరియన్ అసోసియేషన్ సభ్యులు రూ. 15 లక్షల విలువ చేసే డ్రోన్లు, సీసీ కెమెరాలు అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ కొరియన్ అసోసియేషన్ ఛైర్మన్ జుంగ్యంగ్ హూ పోలీసు శాఖకు 1 నైట్ విజన్ డ్రోన్, 2 డే విజన్ డ్రోన్లు, 6 ఎన్‌పిఆర్ సీసీ కెమెరాలు అందజేశారన్నారు. ఆటోమేటిక్ నెంబర్ ప్లేట్ గుర్తింపు కెమెరాలు చాలా ఉపయోగకరం అన్నారు. ఎక్కడైనా క్రైం, అసాంఘిక కార్యకలాపాలు జరిగితే రాత్రైనా, పగలైనా కచ్చితంగా గుర్తించేందుకు అవకాశం ఉందన్నారు. పెనుకొండ స్టేషన్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం పోలీసులు డ్రోన్ పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్పీ నర్సింగప్ప, సిఐ రాఘవన్, పెనుకొండ, కియా ఇండస్ట్రియల్ పోలీస్ స్టేషన్, పరిగి, రొద్దం ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, రాజేష్, కొరియన్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

5న 'పిటిఎం'.. జయప్రదం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాప్తంగా డిసెంబర్ 5వ తేదీ నిర్వహించనున్న మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్(పిటిఎం) విజయవంతం కావడానికి అన్ని పాఠశాలల్లో ఏర్పాట్లు పూర్తిచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థుల అభ్యాస పురోగతి, హాజరు, ప్రవర్తన, హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుల వివరాలను తల్లిదండ్రులకు సమగ్రంగా తెలియజేయడం, పాఠశాల అభివృద్ధిలో సమాజ పాత్రను మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, కెజిబివిలు, ఎపిఎంఎస్, ఎపిఆర్ఇఐఎస్ పాఠశాలల్లో ఈ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి పాఠశాలకు హెడ్‌మాస్టర్ ప్రధాన బాధ్యత వహిస్తారని, మండల స్థాయిలో ఎంఇఒలు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు పర్యవేక్షణ చేయాలన్నారు. తల్లిదండ్రులకు ఆహ్వాన పత్రాలు పంపిణీ చేయడం, పాఠశాలల్లో శానిటేషన్, తాగునీరు, సీటింగ్, మైక్ సిస్టమ్, అలంకరణ, రిసెప్షన్ కౌంటర్లు, తదితర ఏర్పాట్లు తప్పనిసరిగా చేయాలన్నారు. విద్యార్థుల అభ్యాస కార్యకలాపాలు చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం, సంఖ్యలు, లెక్కల ప్రాథమిక నైపుణ్య కార్యక్రమాలు, లైబ్రరీ, సైన్స్, స్పోర్ట్స్ కిట్‌ల ప్రదర్శనలు కూడా తల్లిదండ్రులకు చూపాలన్నారు. ప్రతి తరగతి ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో ప్రత్యక్షంగా మాట్లాడి విద్యార్థుల పురోగతిని వివరించడంతో పాటు, ఇంటి అభ్యాసానికి తల్లిదండ్రుల సహకారం ఎంత అవసరమో వివరించాలన్నారు. సమాజ భాగస్వామ్యాన్ని



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పెంపొందించేందుకు ఎస్ఎంసి సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులను పాఠశాల స్థాయిలో మాత్రమే ఆహ్వానించాలన్నారు. వాట్సప్ గ్రూపులు, గ్రామ ప్రకటనలు, విద్యార్థుల ద్వారా సమాచారాన్ని పంపించడం ద్వారా ఎక్కువ మంది తల్లిదండ్రుల హాజరును నిర్ధారించాలన్నారు. జిల్లాలో విద్యా ప్రమాణాలను పెంచడం, విద్యార్థుల అభ్యాసాన్ని బలోపేతం చేయడం, తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలందించాలి : కలెక్టర్


జిల్లా ప్రజలకు మరింత మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఇందుకు అన్ని విభాగాలు బాధ్యతగా పని చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. జిల్లా ఆసుపత్రుల్లో వైద్య సేవల మెరుగుదల, భవన నిర్మాణ పనుల ప్రగతిపై అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా వైద్య సేవలు, ఆసుపత్రి భవన నిర్మాణ పురోగతి, శానిటేషన్ మెరుగుదలపై వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ వైద్య సేవలను ప్రజల అంచనాలకు అనుగుణంగా మరింత మెరుగుపరిచేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలన్నారు. ఆసుపత్రుల్లో టెస్టులు, మందులు, అత్యవసర సేవలు నిరంతరంగా అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది హాజరు, రోగుల సేవల్లో శ్రద్ధ పెట్టాలన్నారు. ఆసుపత్రుల లోపల, పరిసరాల్లో మెరుగైన పారిశుధ్యం పాటించాలన్నారు. ఆసుపత్రుల్లో జరుగుతున్న మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలన్నారు. భవన నిర్మాణాల పురోగతిలో వేగం పెంచాలని, నాణ్యతపై తప్పనిసరిగా దృష్టి పెట్టాలన్నారు. ధర్మవరం భవనం ప్రధాన నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో మిగతా పనులను షెడ్యూల్ ప్రకారం ముగించాలన్నారు. కొత్త ఆసుపత్రి భవనాల్లో ప్లాస్టరింగ్, పెయింటింగ్, ఫ్లోరింగ్, ఎలక్ట్రికల్, తదితర పనులను సమయానికి పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మడకశిర, కదిరి, తనకల్లు, పెనుకొండ, నల్లమాడ ఆసుపత్రి భవనాల్లో జరుగుతున్న పనులను మార్చి లోపు పూర్తి చేయాలన్నారు. ప్రతి ఆసుపత్రి అవసరాలు, బడ్జెట్ ప్రతిపాదనలు, ఖాళీ ఉద్యోగాల వివరాలను సమగ్రంగా సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ మధుసూదన్, డిఎంహెచ్ఒ ఫైరోజ్‌బేగం, వైద్యాధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యుటిఎఫ్ మోడల్ పేపర్లు పంపిణీ

ప్రజాశక్తి-కొత్తచెరువు

పదో తరగతి విద్యార్థుల కోసం యుటిఎఫ్ రూపొందించిన మోడల్ పేపర్లను సద్వినియోగం చేసుకోవాలని డిఇఒ జి.కృష్ణప్ప సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. స్థానిక బాలుర జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం కొత్తచెరువు, బుక్క పట్నం, పుట్టపర్తి మండలాలకు చెందిన విద్యార్థులకు హెచ్ఎం గోపాల్ ఆధ్వర్యంలో మోడల్ పేపర్లు పంపిణీ చేశారు. డిఇఒ మాట్లాడుతూ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత యుటిఎఫ్ ప్రశ్నపత్రాలు రూపొందించి విద్యార్థులకు ఉచితంగా అందజేయడం అభినందనీయమన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జయచంద్రారెడ్డి మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రశ్నపత్రాలను తయారు చేయించి విద్యార్థులకు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, సీనియర్ నాయకులు భాస్కర్, లక్ష్మీనారాయణ, రామకృష్ణనాయక్, బాబు, నూర్జహాన్, తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : పట్టణంలోని ఉర్దూ మెయిన్, వీవర్స్ కాలనీ, కుటాగుళ్ల ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు స్థానిక సిమ్స్ హాస్పిటల్ ఎండి బి.నిసార్‌యాసిన్‌ఖాన్ ఆధ్వర్యంలో యుటిఎఫ్ మోడల్ పేపర్లను ఉచితంగా పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ దిల్షాద్ ఉన్నీసా,



కొత్తచెరువులో యుటిఎఫ్ మోడల్ పేపర్లు పంపిణీ చేస్తున్న డిఇఒ కృష్ణప్ప, నాయకులు

ఎంఇఒ చెన్నకృష్ణ హాజరై మాట్లాడారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. దాత నిసార్ యాసిన్ ఖాన్‌ను అభినందించారు. నిసార్ యాసిన్ ఖాన్ మాట్లాడుతూ పిల్లలు చదువుతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎలు ఎస్.నాగరాజు, శైలజ, ప్రభాకర్ నాయుడు, నిజాంవలి కాలనీ హైస్కూల్ హెచ్ఎం రమణారెడ్డి, టిడిపి నాయకులు బావుద్దీన్, యుటిఎఫ్ నాయకులు శ్రీనివాసులు, తాహెర్‌వలి, మధుసూదన్, విశ్రాంత హెచ్ఎం మైనుద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విపత్తులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది

విపత్తులపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-రొద్దం

ఏదైనా విపత్తు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(ఎన్‌డిఆర్ఎఫ్) సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక జడ్పీ హైస్కూల్, కెజిబివి, ఎంజెపిలో మంగళవారం ఎంఇఒ-2 జయభాస్కర్ ఆధ్వర్యంలో విపత్తు నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అత్యవసర సమయాల్లో ఎలా వ్యవహరించాచి, గాయాలైనప్పుడు, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు, హార్ట్ ఎటాక్ వచ్చిన వారిని ఎలా కాపాడాలి అనే అంశాలపై ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది ప్రదర్శన చేస్తూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌డిఆర్ఎఫ్ టీం కామాండర్ అవినాష్, సభ్యులు పాటిల్ ధ్యానేశ్వర్, జి.గంగాధర్, అరవింద్‌రెడ్డి, చిన్న కదిరయ్య, జడ్పీ హైస్కూల్ హెచ్ఎం లక్ష్మీనారాయణ, కెజిబివి ప్రిన్సిపల్ నాగరత్న, ఎంజెపి ప్రిన్సిపల్ అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.



'ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవం'లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి రూరల్ పరిధిలోని ఎరుకలవాండ్లపల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాలలో మంగళవారం కంప్యూటర్ టీచర్ పూజిత ఆధ్వర్యంలో 'ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవం' ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ ఎంఎస్.కిరణ్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్య, వైద్యం, వ్యాపారం, సమాచార మార్పిడి, తదితర రంగాల్లో కంప్యూటర్లు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. కంప్యూటర్ మానవ జీవితంలో అంతర్భాగం అయిందన్నారు. మహిళలు, పిల్లలు కూడా డిజిటల్ ప్రపం చంలో భాగమయ్యేలా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. ప్రతి విద్యార్థి కంప్యూటర్ నైపుణ్యాలను నేర్చుకోవడానికి ప్రయత్నించాలన్నారు. విద్యార్థి దశ నుంచే కంప్యూటర్ పరిజ్ఞానంపై పట్టు సాధించా లన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంకేతిక పరికరాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమం లో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీ పార్థసారథి సోదరి మృతి

ప్రజాశక్తి-రొద్దం

ఎంపీ బికె.పార్థసారథి సోదరి రామాంజనమ్మ(94) మంగళవారం మండలంలోని చిన్నమంతూరు గ్రామంలో మృతి చెందారు. విషయం తెలుసుకొన్న ఎంపీ పార్థసారథి, ఆయన భార్య కమలమ్మ ఆ గ్రామం వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట టిడిపి జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, రామాంజి ఉన్నారు.



రామాంజనమ్మ మృతదేహానికి పూలమాల వేస్తున్న ఎంపి దంపతులు

జిమ్నాస్టిక్ పోటీల్లో కాంస్య పతకాలు

బత్తలపల్లి : 69వ రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ జిమ్నాస్టిక్ పోటీల్లో మండలంలోని మాల్యవంతం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు కాంస్య పతకాలు సాధించినట్లు హెచ్ఎం చెన్నకృష్ణారెడ్డి, పిడి నాగరాజు తెలిపారు. వారు మాట్లాడుతూ ఇటీవల కాకినాడలో జరిగిన జిమ్నాస్టిక్ రాష్ట్రస్థాయి పోటీల్లో తమ విద్యార్థులు బిల్లే రాము, నందన కుమారి పాల్గొని, అత్యంత ప్రతిభ కనబరిచి తృతీ య స్థానంలో నిలిచి కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం, పిడితో పాటు ఎస్ఎంసి సభ్యులు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

నేరాలు ఘోరాలు

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య

ప్రజాశక్తి-బత్తలపల్లి

గొడవపడి పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి కాపురానికి రాలేదనే కారణంతో మనస్థాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బత్తలపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. స్థానిక ఎస్‌బిఐ కాలనీలో నివాసం ఉంటున్న మినమనూరి మధు, పుష్పవతి దంపతుల పెద్ద కుమారుడు అశోక్‌కుమార్(27) సొంతంగా ఐచర్ వాహనాలు పెట్టుకొని జీవనం సాగించేవాడు. అతడికి అనంతపురం నగరానికి చెందిన రాణితో రెండేళ్ల క్రితం వివాహం జరిపించారు. అన్యోన్యంగా సాగుతున్న వారి దాంపత్యంలో ఇటీవల గొడవలు చోటుచేసుకున్నాయి. దీంతో రాణి పుట్టింటికి వెళ్లిపో యింది. ఎంత పిలిచినా కాపురానికి తిరిగి రాలేదు. దీంతో ఆశోక్‌కుమార్ తాగుడుకు బానిసయ్యాడు. అశోక్‌కుమార్ తల్లిదండ్రులు, తమ్ముడు లోకేష్ గత ఆదివారం ప్యాపిలి మండలంలోని భోంచేరుపల్లి గ్రామంలో జాతరకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో సోమవారం రాత్రి అశోక్ కుమార్ సీలింగ్ కడ్డీకి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం తిరిగొచ్చిన తల్లి దండ్రులు ఉరికి వేలాడుతున్న కుమారుడిని చూసి గుండెలవిసేలా రోదించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ సోమశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ట్రాక్టర్ ఢీకొని గొర్రెలకాపరి మృతి

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

ట్రాక్టర్ ఢీకొనడంతో గొర్రెలకాపరి మృతిచెందిన సంఘటన మంగళవారం మండలంలోని పెద్దగుట్లపల్లి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. పెద్దగుట్లపల్లికి చెందిన గొర్రెలకాపరి వగ్గనగారి గంగులప్ప(57) గ్రామ సమీపంలోని ఊరు బోరు వద్ద గొర్రెలు మేపుతండగా ట్రాక్టర్ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని ఓడిసి ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ వెంకటేష్ తెలిపారు. అతడికి భార్యతో పాటు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఎమ్మెల్యే దిగ్భ్రాంతి

టిడిపి కార్యకర్త గంగులప్ప మృతి విషయం తెలియడంతో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గంగులప్ప కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామన్నారను. పార్టీపరంగా బీమా పరిహారంతో పాటు ప్రభుత్వపరంగా ఆదు కుంటామని హామీ ఇచ్చారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులను టిడిపి మండల కన్వీనర్ శెట్టి వారి జయచంద్ర, మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబుల్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌నాయక్, శరత్‌కుమార్‌రెడ్డి, రెడ్డప్పరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, మల్లికార్జున పరామ ర్శించారు.

బ్యాంకులో ఏమార్చి నగదు అపహరణ

ప్రజాశక్తి-నల్లచెరువు

బ్యాంకులో నగదు జమ చేయడానికి వెళ్లిన ఖాతాదారురాలిని గుర్తు తెలియని వ్యక్తులు ఏమార్చి నగదు కాజేసిన సంఘటన మంగళవారం స్థానిక ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాలు.. మండలంలోని పులిమివాండ్లపల్లికి చెందిన రమణమ్మ మధ్యాహ్నం సమయంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుకు వెళ్లింది. తన ఖాతాలో రూ. 52వేల నగదు జమ చేసే క్రమంలో డిపాజిట్ పత్రంలో వివరాలు రాస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి నగదు లెక్క పెట్టి ఇస్తామని చెప్పి అందులో కొంత కాజేశారు. ఆలస్యంగా పసిగట్టిన రమణమ్మ తాను మోసపోయినట్లు గ్రహించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.